

# పల్లెకి

అనగా అనగా ఓ వూరు.

ఆ వూరి పేరు ఏదైతే మనకెందుకులెండి. భారతదేశంలోని అనేక వూళ్ళలో అదొకటి. ఈ దేశంలో జరిగే అనేక మంచి చెడ్డల్లో ఏది జరిగినా పేరు చెప్పి ఆ వొక్క వూరికే ఎందుకు ఆపాదించాలి,

అందుకే ...

అనగనగా ఓ వూరు అందాం.

ఆ వూరిని కుడి ఎడమలుగా చేస్తూ ఓ మురిక్కాలవుంది పేరుకు మురిక్కాలవేగాని నిజానికి అదో నది. ఆ నది వూరిని కుడి యెడమలు చేసిందన్నాకదూ. 'కుడి యడమైనా పొరబాటు లేదోయ్' అని తెగేసి తాగేసిన వేదాంతం చెప్పించాడో సినిమాకవి. కాని అలాంటి పొరబాటు పొరపాటునకూడ ఆ వూరి చరిత్రలో ఇంతవరకు జరగ లేదు. అవన్నీ చెబుతూ కూర్చుంటే అప్రస్తుతమని తీసిపారేస్తారేమో పోనీండి —

అసలింతకీ చెప్పొచ్చేదేమిటంటే —

ప్రకృతి ఆ వూరిని క్రూరంగా విభజించినా ప్రజలు మాత్రం కట్టుగా కట్టె వంతెనతో కలిపేశారు.

ఎందుకంటే —

పనిచేయించుకునే వాళ్ళంతా కుడిపక్కా, చేసేవాళ్ళంతా ఎడంపక్కా వుండిపోవటం సంఘ శ్రేయస్సు దృష్ట్యా అంత మంచిదికాదు గనుక !

ప్రగతి ప్రణాళికలన్నీ సామాజిక జీవనాన్ని సుఖప్రదం చేయటానికి అనే తెరవెనుక, పాలకుల పలుకుబడిని పెంచుకోటానికి పడే తాపత్రియం అని సామాన్యుడి అభిప్రాయం.

కాని —

ఈ కట్టె వంతెన అసలు అందుకోసమే కట్టింది కాదు.

అలా ఎందుకు అంటున్నానంటే....

అవతలిపక్క స్మశానమూ, అలగా జనమూతప్ప అంత పలుకుబడిని పెంచుకోదగ్గ ఆసరాలేవీ లేవు. అప్పుడప్పుడూ చావుల్లాంటి వాటిని వైతరిణిలా దాటించటానికి అక్కడ బల్లకట్టు ఒకటి వుండనే వుంది.

అయితే మరెందుకు ?

ఈ వంతెన నిర్మాణానికి ముందు ఆ వూరి రెండుపక్కలూ సంయుక్త సభలు జరుపుకున్నాయి. అక్కడి వుపన్యాసాలతీరే ఈ ప్రశ్నకి సమాధానం.

'మీరు అవతలా, మేం యివతలా ఉండిపోవటం ప్రజాస్వామిక సూత్రాలకు కట్టుబడి బతుకుతున్న మనవూరి సాంప్రదాయానికి అంత ఆరోగ్యకరం కాదు. మనమధ్య వారధిలా బల్లకట్టు వుందికదా అని

ఎవరైనా చిలిపి ప్రశ్న వెయ్యవచ్చు. నిజమే. కాదనను. కాని ఆ బల్లకట్టును నమ్ముకుంటే, దాని తాడు ఏ కుర్రికుంకో విప్పేస్తే, అది ప్రవాహంలోపడి పది మైళ్లు పోయి రెండు మూడు నెలలకుగాని యధాస్థానంలోకి చేరని అనేక సంఘటనలు మనకు ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో ప్రతి చిన్నపనికీ, పెద్దపనికీ కాలువ ఈదుకుని ఇవతలికి రావటం అన్నివేళలా మంచిది కాదు. వాన వచ్చినా వరద వచ్చినా అది ప్రమాదానికి దారితీయవచ్చు. అందుకే మీ శ్రేయస్సుకోరే చెబుతున్నాం. మీరు ఎలాగూ రెక్కలమ్ముకొని బతికేవాళ్ళే. ఆ రెక్కల సాయంతోటే వంతెన నిర్మాణం చేస్తే మీ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

మొన్న — గూడెం రోడ్డు నిర్మాణం విషయం మీకు తెలుసో తెలీదో. అక్కడి లేబరంతా శ్రమదానంచేసి ఆరుమైళ్ళ రోడ్డు నిర్మించారు. అది సినిమాకూడా తీశారు. అంతేకాదు. వాళ్ళతో మంత్రిగారు ఫొటోలు తీయించుకున్నారు. ఈ వంతెనకూడా మంత్రిగారు ప్రారంభోత్సవం చెయ్యక తప్పదు. మీ శ్రమని మీ పొట్టలవరకే పరిమితం చేసుకున్నారు గనుక దాని శక్తి విలువా మీకు తెలీదు. కాని దాన్ని ప్రపంచం అంతటికీ చాటి చెప్పాలని మా ఆశ, ఆశయమున్నూ.'

అలా జరిగింది ఒకరోజు సభా, అందులోని ఉపన్యాసాలున్నూ—

అంత బాగా చెప్పింతర్వాత అవుననకుండా ఎట్లా ఉందురు చెప్పండి. ఆవతల చెప్పిందేమో సాక్షాత్తూ ధర్మరాజు ధర్మారావు నాయుడుగారయ్యే! 'ఆ దరమతండ్రి' ఏం చెప్పినా వాళ్ళకు కాదన బుద్ధేయదు.

అందుకే 'ఔ' నని వెళ్ళిపోయారు అవతలి జనం.

అలా వాళ్లు వెళ్ళిపోయిం తర్వాతే జరిగింది అసలు కథ.

సభ ముగిసేక ధర్మారావుగార్ని అందరూ ఒకటే పొగడ్డం. నొవ్వకుండా ఒప్పించగల ధీశాలి. అందుకే పంచాయితీ పుట్టినప్పటి నుంచి ఆ మహానుభావుడే ప్రెసిడెంటుగా ఉంటున్నాడు మరి!

అలా పుట్టింది ఆ కట్టు వంతెన.

పాపం! ఇవతలివాళ్లకూడా శ్రమదానం చేశారెండి. లేకపోతే యీ పనికిమాలినవాళ్ళతో పనెలా జరుగుతుంది!!

* * *

వంతెనకు ఎడంగా అల్లంత దూరాన్న వందకు పైగా గుడిశెలు వున్నాయి. వాటికి పక్కనే హిమన్నగంలా ఎదుగుతోన్న పెద్ద పెంటకుప్ప ఉంది. గుడిశెల్ని గుట్టుగా గుండెల్లో దాచుకుంటూ ముళ్ళ తుమ్మలున్నాయి.

తుమ్మల తోపులో తిమిరం తెల్లగా కరుగుతోంది. వేకువ తాలూకు వేడి నులివెచ్చగా చిగుళ్ళమీద వేళ్ళాడుతోంది.

మురికాల్వమీద వంతెన వచ్చాక ఎన్నడూ తూరుపు ఎరుపు చూడని కూలిజనం ఆనాడు పొద్దు పైకెక్కినా అక్కడే ఉండిపోయారు. తుమ్మల నీడల్లో — నీడల్లా అతుక్కుపోయిన ఆ మానవ ఆకారాలు తెల్లవార్లూ అలాగే కూర్చుని ఉండిపోయాయి. అయినా సమస్య తీర లేదు.

విసుగెత్తి లేచిపోయాడు యానాది రాముడు.

'ఒరె యెదవ నాయాల్లారా మీరేం సేత్తార్రా! ఆర్సేవోళ్ళా! తీర్సేవోళ్ళా? నా కొడుకు పల్లకీ యెక్కి పెల్లాడ్తానన్నాడు. అది సబువా( కాదా అండానికే రేత్రంతా తేల్లేదు. ఇంక సాకలప్పన్నని

పల్లకి అడిగి తెత్తారా మీరు... తూత్... అడంగి నాయాల్లారా... నేనే పోతా. పోయి ఆ మునసబునే అడుగుతా...' అంటూ వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

ఏనాటి రాముడి కొడుకు అంకడు అయిదేళ్ళ క్రితం ఊరొదిలి ఎక్కడికి పోయాడో ఏమో! వారం రోజుల క్రితమే ఊళ్ళోకి ఊడి పడ్డాడు. వచ్చీ రాగానే అంకడి దృష్టి పంతెనమీదా, పేట పక్క పెరిగిపోతున్న పెంటకుప్పమీదా పడింది.

'మీరు శ్రమదానం చేసి సంపాదించిన సంపాదన ఇదన్నమాట' అన్నాడు.

పేటలోని పెద్దవాళ్ళంతా తమ చర్యను నెమరు వేసుకొని తలలు గోక్కున్నారు.

పంతెన కట్టక మునుపు మంచిగాలీ ఆరోగ్యమైన వాతావరణమూ వాళ్ళ చుట్టూ వుండేవి. పంతెన కట్టగానే పెంటంతా పేట పక్కకు చేరింది. వూళ్ళో విసర్జితమైన మలం అంతా ఇక్కడికిచేరి వాతావరణం కలుషితం చేస్తోంది. ఎన్నడూ రోగం మాటెరుగని పిల్లా జెల్లా రోగాల్తో చచ్చిపోతున్నారు. పెంటకుప్పలో ఆడుకుంటూ కాలు తెగి, సెప్టిక్ అయి నిన్నగాక మొన్ననే ఒక కుర్రాడు పోయాడు. ఇవన్నీ వాళ్ళ తలల్లో మెదిలాయి.

ఇదంతా అన్యాయమని వాళ్లకు నచ్చజెప్పాడు. పెంటకుప్పా మలవిసర్జనా అక్కణ్నుంచి తొలగించాలని ఆందోళన లేవదీశాడు అంకడు. ఆనాడు పెద్దకాపు చేసిన పరిహాసం ఇంకా వాడి గుండెల్లో కార్చిచ్చులా రగుల్తూనే ఉంది.

'అబ్బో! మొనగాడు బయద్దేరాడోయ్!! ఇంకేం మనకో నాయకుడు పుట్టాడు. పల్లకిలో వూరేగించండి మరి'

'అవును ఏం? పల్లకిలో ఎందుకు ఊరేగకూడదు' అదే వాడి మనసులో మెదుల్తోంది.

రాముడు రాక రాక ఇంటికి వచ్చిన కొడుకుని పెళ్ళిచేసుకొమ్మని అడిగినప్పుడు--

'నేను పెళ్ళి చేసుకోకూడదనే అనుకున్నాను కాని చేసుకుంటాను. పెద్దకాపు పొగరు అణచడానికైనా చేసుకుంటాను. నువ్వు చేస్తావా?' అనడిగాడు.

'సెయ్యాలవే గదరా మరి నిన్నడుగుద్ది'

'అది నాకూ తెల్సు. ఆ పెళ్ళి కాదు నేనదేది. పల్లకీ ఎక్కి ఊరంతా ఊరేగాల.'

రాముడు ఆలోచించాడు.

'ఇంత వరకూ మనదెబ్బకు ఎదురే లేదీ వూళ్ళో. సరే సూద్దాం' అన్నాడు.

కానీ పేటలో వాళ్లంతా అందుకు అంగీకరించలేదు. వాళ్లకు ఊరినుంచి బెదరింపులు వచ్చాయి.

'మీరూ వాడిమాటకు తాళం వేసేరో చూసుకోండి. పుట్టగతులుండవు' అని బెదిరించాడు పెద్దకాపు. ఈ ఒంటిపూట మెతుకులైనా ముట్టవేమోనని బెదిరిపోయారు ఆ అమాయకులు.

'మనం కట్టం అమ్ముకు బతికే వాళ్లం. మనకి పెద్దోళ్ల యేసాలెందుకు?'

'మనం ఆ మారాజులగ్గర అడుక్కుతింటునోళ్ళం. ఆళ్ల ముందే పల్లకీలో వూరేగటం ఏం సబబు'

'మన తండ్రులెక్కారా, మన తాతలెక్కారా, అల్ల తాతలెక్కారా పల్లకీలు.'

అలా నడిచేయి అభిప్రాయాలు. అంకడికి ఇవేంనచ్చలేదు. సాధ్యమైనంతవరకూ వాళ్లను ఉత్తేజపరిచే ప్రయత్నం చేశాడు.

'మీరు మీ తాతముత్తాతల్లాగే వుండాలనుకుంటున్నారా? అయితే వాళ్లు కొండగుహల్లో వున్నారు. వాళ్ల తాతలు చెట్లమీదా, చెట్ల తొర్రల్లోనూ బతికేరు. మొలకి గోచీ అయినా లేకుండా తిరిగేరు. మరి మీరలా ఎందుకుండరు? వాళ్లు ఎవళ్లకీ దాస్యం చెయ్యలేదు. ఎవడి బతుకు వాడు బతికేడు. బతుకుతో పోరాడి మరీ బతికేరు. మరి మీరు యీ భూస్వాముల మోచేతి గంజినీళ్ళెందుకు తాగుతున్నారు?' అనడిగాడు.

'ఆ బాబులు పెట్టకపోతే ఎలా బతుకుతున్నాం?'

'అదే బానిసబతుకు. బానిస ఆలోచన. మీకు వూరికే ఎవడూ కూడు పెట్టడు. కూలి చెయ్యండే మీకు ఏనాడైనా దొరికిందా? దొరికే విధానమే వుంటే మనం మాత్రం పనిచేస్తామా? కాబట్టి ఒకణ్ని ఒకడు దోచుకుతినే ఈ సమాజంలో ఎవడూ ఊరికే పైసా వదులుకోడు. నువ్వు కుంచెడు కూలికి పండించిన ధాన్యం బస్తా వందకి అమ్ముతున్నాడు. అంటే నిన్ను ఎంత దోచుకుంటున్నాడో ఆలోచించు.

'వీళ్ళు దోచుకుంటున్నది ఒక్క విధాన కాదు. లక్ష విధాల. మనం ఊరవతల వల్లకాడు పక్కన కాలుతున్న శవాలముందు బతికున్న శవాల్లా ఎందుకు బతుకుతున్నాం. చెట్టూ చేమా వేసుకుని మంచి యిళ్ళు కట్టుకుని హాయిగా ఊరిమధ్య బతుకుతున్నవాళ్ళం ఇక్కడికి ఎందుకు వచ్చాం? వాళ్లు వెళ్ళగొడితేనే రాలేదు. అంత కళ్ళకు కట్టేట్టు ఏపనీ చెయ్యరు వాళ్ళు. మీ బలహీనత ఎక్కడో తెల్సుకుని మరీ కొడతారు. మీరా చోటు వదిలి వెళ్ళిపోతే ఊరికి ఉపకారం జరుగుతుందన్నారు. హాస్పిటలు కడితే అందరితోపాటు మన పిల్లలకీ మనకీ మందులు దొరుకుతాయన్నారు. అవుననుకుని లేచొచ్చి

పల్లకాళ్ళో ఇళేసుకున్నాం. మన పిల్లలూ మనమూ చాపటం మానామా? రోగమొస్తే ఎప్పుడైనా కాసిన్ని ఎర్రనీళ్ళయినా పోసిన పాపాన్న పోయాడా ఆ డాక్టరు ? ఎంతసేపూ ప్రెసిడెంటుకీ, వాడి బంధువులికీ తప్ప ఎప్పుడైనా నాలాంటి పేదోళ్ళ చెయ్యి పట్టుకుని నాడి చూశాడా? ఇవీ మన బతుకులు, చేతకాని బతుకులు.

'పల్లకీ ఎక్కి పెళ్ళాడితే నేను ప్రభువునైపోనని నాకూ తెల్సు. ఎవడో అన్నాడు. నువు పెద్దకాపు కొడుకువి. పల్లకీ పెళ్ళి చేసుకోటానికి అడ్డేమీ లేదు అని. నాకు చెడ్డ నవ్వొచ్చింది. నే నెవడికి పుడితే యేం ? నేను ఉన్నదెక్కడ ? యే సమాజంలో యే వాతావరణంలో పెరిగాను. అంతస్తుకీ దీనికీ ముడిపడి వుంది కాబట్టే నేనంత పట్టు పడుతున్నాను. వాళ్ళు ఎప్పుడూ పల్లకీ ఎక్కేవాళ్ళు, మనం మోసే వాళ్ళగానే ఎందుకు వుండిపోవాలి ?'

ఈ ప్రశ్నలకి వాళ్ళదగ్గర సమాధానాలు లేవు. పైగా అవన్నీ మంచిగానే అవుపించాయి వాళ్ళకి. ఏమీ చెప్పలేక లేచి ఎవరిదార్న వారు వెళ్ళిపోయారు.

ం ం ం

పల్లకీ బానిస విధానానికి చిహ్నమని తెల్సుకోటానికి చాలాకాలం పట్టింది అంకడికి. ఎంతమంది దగ్గరో ఎన్నో విషయాలు తెల్సుకున్నాడు. ఎన్నో సాహసకార్యాలు చేశాడు. నేటికి సమాజ పరిణామాన్నీ నైజాన్నీ గుర్తించగలిగే స్థితికి వచ్చాడు.

అంకడికి తను యేనాటి రాముడికి కొడుకుగానే తెల్సు చాలా కాలం వరకూ. కాని వయసు వచ్చాక, జనం అనుకునే మాటలు విన్నాక వాడికి పిచ్చెత్తి పోయింది. తను రాముడికి పుట్టలేదట ! పెద్ద

కాపుకి పుట్టాడట ! ! అదెలా జరిగింది ! వ్యభిచరించిందని స్వర్గంలో వున్న తన తల్లిని అనుమానించాలా ? లేక తన తండ్రే పెద్దకాపు పెళ్ళాన్ని లేపుకొచ్చాడా ? ఈ ప్రశ్నలు వాణ్ణి చాలాకాలం వేధించాయి. పేటలో కనపడ్డ ప్రతి పెద్దవాణ్ణి అడిగాడు. తద్వారా తెల్సిన కథ ఇది.

ఏనాటి రాముడంటే ఎలాంటివాడికైనా హడలే ! వాడికి తప్పులు చెయ్యటం అన్నా, తలలు నరకటం అన్నా యేమాత్రం వెరపు లేదు. అందులోనూ వాడికి నిత్య తీర్థసేవనం. వదల్లేని అలవాటు ! ఇలా వుండగా ఆ ఊళ్ళో ధర్మారావుకీ, పెద్దకాపుకీ పంచాయతీ ఎలక్షన్ల దగ్గర పేచీ వచ్చింది. ఎలక్షన్లపేచీ ఉరుము వురిమి పిచ్చికమీదపడ్డ సామెతగా చేలగట్ల తగాదాగా పెరిగి ధర్మారావు పాలేరు వెంకడి మీద పడింది. నీరు కట్టదగ్గిర మాటామాటా పెరిగి పెద్దకాపు పాలేరును కొంచెం తోశాడు వెంకడు. అది తెల్సినవెంటనే 'ఆ చిక్కాడు నాయుడు' అనుకున్నాడు పెద్దకాపు. కాని చిక్కింది ధర్మారావు కాదు, వెంకడు.

ఓ రోజున రాముడిని పీకదాకా తాగించి

'ఒరే ! చూసుకోరా రాముడూ' అన్నాడు పెద్దకాపు.

'అయ్యబాబో పెళ్ళాడి నెలైనా కాలేదు నేనెయిలుకుపోతే నా యింటిది ఏమైపోద్ది ?' అన్నాడు అంత మైకంలోనూ.

'నీ యింటిదాని గొడవ నాకు ఒదిలెయ్యవోయ్ ! దాన్ని పోషించే బాధ్యత నాది. నువ్వు తిరిగి ఒచ్చేటప్పటికి పువ్వుల్లోపెట్టి నీకు అప్ప గించనూ ! ఏమంటావ్ ?'

'నాభం నేదు'.

మరికొంచెం తాగించి_

‘యేమంటావ్?’ అనడిగాడు మళ్ళీ.

‘సై అంతా .....’ అన్నాడు నత్తిగా.

కత్తి చేతిలో పెట్టాడు పెద్దకాపు. అంతే...ఆ మునిమాపువేళ నాగలి భుజాన్నేసుకుని తోటగట్లవెంట నడుస్తున్న వెంకన్న తలతెగి కిందపడింది. రాముడు జైల్లో పడ్డాడు. ఆతర్వాత రాముడి పెళ్ళాం మీద పడ్డాయి పెద్దకాపు కళ్ల

‘రాచకొంపలో పడాల్సిన రంగమ్మ రాముడి గుడిశెలో పడింది.’ అన్నారు. ఆమెను మొట్టమొదట చూసిన జనం. ‘రాముడు శీరావఁ సెందురుడు గాపోయినా రంగమ్మ శీతమ్మోరె’ అన్నారు తర్వాత. అలాంటి రంగమ్మమీద పెద్దకాపుకు మోజు తలగటం, ఆమె తిరస్కరించటం... ఇవన్నీ రాస్తూ పోతే సినిమాటిక్‌గా వుందంటారేమో! కాని సినిమాలోలాగ పెద్దకాపు రంగమ్మ శీలాన్ని కబళించే వేళకు హీరో రాముడు జెయిల్నుంచి పారిపోయివచ్చిగాని, లేక పెద్ద కాపును కరచి చంపెయ్యటానికి ఏ పాము రూపంలోనో దేవుడు గాని ప్రత్యక్షమై రక్షించలేదు. అలా రంగమ్మా, పెద్దకాపుల రాక్షసరతిలో అంకడు పుట్టాడు. రంగమ్మ చనిపోయింది. ఈ పరిణామాలు పది సంవత్సరాల కాలంలో జరిగాయి. ఈ పది సంవత్సరాల పరిణామాలూ రాముణ్ని పూర్తిగా మార్చివేశాయి.

ఇప్పుడు వాడు మద్యం ముట్టడు. చీమనైనా కొట్టడు.

* * *

అప్పుడే కునుకుపట్టింది మునసబు సాంబయ్యకు. రాత్రింతా సమావేశాలూ చర్చలూనూ. ఆజన్మ శత్రువులుగా పేరుపడ్డ పెద్దకాపు ప్రెసిడెంటు ధర్మారావు ఒక్కటై పోవటం మునసబుకు చాలా ఆశ్చర్యం వేసింది. వాళ్ల వాదనలూ, సమర్థనలూ వింటూ వుంటే అతనికి చిర్రె

త్తుకొచ్చినమాట వాస్తవమే! అవును మరీ! కులం పేరుతో యేవో కొన్ని ఆంక్షల్ని విధించటం యేం న్యాయం? ఎంత పేదవాడైనా పెద్ద కులంవాడై పల్లకీ ఎక్కి పెళ్ళి చేసుకోవచ్చు! ఎంత డబ్బున్న వాడైనా కిందికులంవాడైతే అది కుదరదు. ఎందుకని? అన్యాయమే! కాని అతని ఆలోచనల్లు వేరే దృక్కోణంలో సాగుతున్నాయి.

'ఇలాంటి సాంప్రదాయాలు మంచివికావని ప్రపంచజ్ఞానం తెల్సిన ప్రతివాడూ అంగీకరిస్తాడు. కాని యుగాల తరబడి ప్రజల్లో నాటుకుపోయిన కొన్ని మూఢవిశ్వాసాలవల్ల వాటిని ఛేధించటానికి చేసే ప్రయత్నాలు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఊరి కట్టడి చెడిపోతుంది. చేయి దాటిపోతే రక్తపాతంకూడ అసంభవం యేమి కాదు. ఇదే సొంతం అతని వాదన కాని వినేవాళ్ళేవరు? యేం కానున్నదో యేమో!! అదే ఆలోచిస్తూ రాత్రింతా నిద్రలేమితో బాధ పడ్డాడు. అప్పుడే కునుకు పట్టింది. కిటికీదగ్గర ఎవరో మెల్లగా పిలుస్తుంటే

'ఎవరూ ?' అని లేచి కూర్చున్నాడు.

'నేను బాబయ్యా సాకలప్పణ్ణి. దొడ్డి తలుపు తియ్యండి.'

'ఇంత రాత్రేవిటా్రి. పొద్దున్న రా.'

'కాదు బాబూ ! తియ్యాల' అని పట్టుపట్టాడు.

వెళ్ళి దొడ్డి తలుపు తీశాడు. నలుగురు మనుషులు పల్లకీ తెచ్చి దొడ్లో పెట్టారు.

'ఏవిటా్రి అప్పన్నా'

'పెసిడెంటుగారి ఆడ్దరు బాబయ్యా.'

'ఆయన తన దొడ్లోనే పెట్టించుకోవచ్చుగా.'

'ఏమోనండి తవరింటికాడ పెట్టేసి రమ్మన్నారు' అని వాళ్ళు వెళ్ళిపోయారు.

పొద్దున్నే వచ్చాడు రాముడు.

'నా కొడుకు పల్లకీ పెళ్ళి చేసుకొంటానంటన్నాడు. పల్లకీ ఇప్పించాల' అంటూ మొదలెట్టాడు.

మొదట కొంచెం ఆలోచించాడు. సరాసరి వాడికి ఉపదేశాన్ని ఇవ్వాలనుకున్నాడు. ఏమీ తెలియనివాడిలా.

'పల్లకీ నా జేబులో వుందా ? అప్పన్నని ఒడిగి పట్టుకెళ్ళండి' అన్నాడు. అన్నాడేగాని రాముడి ముఖం చూడగానే తల్లకిందులై పోయాడు.

'ఏం మునసబ్బాబూ ! తవ(రిక్కూడా పెద్దకాపు పెడబుద్ధులు అబ్బాయేంటి ?'

'ఏపేటాగ్రి ?'

'పల్లకీ తెచ్చి ఇంట్లో పెట్టించుకుని యేపీ( ఎరగనట్టే మాట్లా దేత్తన్నారే ?'

'నేను తెప్పించిపెట్టానని ఎవరన్నారు ?'

'అప్పన్న సెప్పాడు.'

'నాతో ప్రెశిడెంటు పెట్టమన్నాడన్నాడు. నీతోనేమో ఇట్లా చెప్పాడా ?'

'ఎవరెట్టా సెప్పినా మీ జాతంతా ఒకటేగాని పల్లకి ఇత్తారా ఇవ్వరా ?'

'పల్లకీ ఎక్కితే మీకేం ఒస్తుందిరా రాముడూ ?' అనడిగాడు మెల్లిగా.

'నాకేం రాదు. పోనీ మీకేంపోద్దో సెప్పరాద నే నెల్లిపోతాను.'

'ఎవరికీ ఏమీ పోదు. ఊరి కట్టడి పోతుంది. అందరం అన్న దమ్ములుగా మెలిగిన మనలో ద్వేషాలు రగులుతాయి.'

'అందరం అన్నదమ్ము లనుకుంటున్నప్పుడు మీకీ పట్టింపులు ఎందుకంట.'

'పట్టింపు కాదురా రాముడూ! సాంప్రదాయం. మనకి మన పూర్వులు కొన్ని సాంప్రదాయాలు పెట్టిపోయారు. ఎంత చెడ్డవైనా వాటిని ఒదులుకోలేం. మనం ఎడంచేత్తో కొన్ని పనులూ, కుడిచేతితో కొన్ని పనులూ చేస్తూ వుంటాం. అలా చెయ్యటంవల్ల వచ్చే లాభం గాని చెయ్యకుండా వుండటంవల్ల కలిగే నష్టంగాని యేమీలేదు. ఎడం చేతితో భోంచేస్తే మనిషి చచ్చిపోడు. కాని ఎవడైనా అలా చేస్తున్నాడా? మనిషికి రెండు చేతులూ సమానమైనప్పుడు ఏ చేతితో చెయ్యాల్సిన పని ఆ చేతితోనే ఎందుకు చేస్తున్నాం. సాంప్రదాయాన్ని అతిక్రమించలేక.'

'అంటే... నేను కూలోడుగా పుట్టానుగామట్టి నా పిల్లలూ ఆళ్ల పిల్లలూ అలా కూలోళ్లుగానే వుండిపోవాలంటారు?'

'నే ననటంలేదు. వాళ్ళంతా అలా అనుకుంటున్నప్పుడు ఊళ్ళో అలజడి తెచ్చేకంటే ఆ ప్రయత్నం మానుకోటమే మంచిదికదా అంటున్నాను.'

'కట్టం అంతా మాది. దర్జా అంతా మీదీ నన్నమాట! అస్పత్రిన్నారు. పుట్టిన స్థలంనుంచీ కట్టుకున్న ఇళ్ళనుంచీ లేచిపోయాం. ఒంతెనన్నారు. మా చెమటోడ్చి, పస్తులుండి రక్తమాంసాలతో అది కట్టాం. దానిమీంచే మీ యిళ్ళలోని చెత్తా చెదారం బళ్ళతో తోలి మా యిళ్లముందు కుప్ప పెడతన్నారు. అది ఒద్దని నా కొడుకు అడిగిందానికి పెద్దకాపు యెటకారం సేత్తె మీరంతా నోరెత్తారా? ఈ సీరంగ నీతులన్నీ మా దగ్గిరేనా?'

'నీకింకేమీ చెప్పలేను రాముడూ. నావల్ల నీకు కావల్సిన సాయం ఏదైనా వుంటే చెప్పు. పెళ్లికి ఓబస్తా బియ్యం పట్టు

కెల్తావా? పప్పు వుప్పు ఏమైనా ఇప్పించమంటావా? ఏం కావాలో చెప్పు.'

'అయ్యేం మా కక్కర్లేదుగాని పల్లకీ యిప్పించండి.'

'సరే! నువ్వంత పట్టుపడితే నేను మాత్రం ఏంచేస్తాను. అలాగే పెళ్ళిరోజున వచ్చి పట్టించుకెళ్ళు.'

o o o

పెళ్ళి రెండ్రోజులుందనగా పేటకు కబురెళ్ళింది.

'పల్లకీ పట్టుకెళ్ళటానికి ఏమాత్రం ప్రయత్నంచేసినా ప్రాణాలు పోతాయి. రక్తపాతం జరుగుతుంది' అని.

అది విని రాముడు పేట్రేగిపోయాడు.

'పెద్దకాపూ! నువు నా కాపరం పడగొట్టినా, నా రంగిని పొట్టన పెట్టుకున్నా వూరుకున్నానని సేవలేనోణ్ననుకుంటన్నవేమో. యెదవ పన్లు సెయ్యకూడదనిగాని సేతగాక మాత్తరం గాదు. ఇప్పుడూ సేత గానోల్లాగ పడివుంటననుకుంటన్నవేమో సూద్దాం. ఎవడి పేనాలు పోతాయో' అని సవాలుచేసి వచ్చేశాడు. వచ్చి తుప్పుపట్టిన కత్తి తీసి నూరటం మొదలెట్టాడు.

పేటలో ఒక్కడూ తనవెంట రాకపోయినా తనొక్కడూ జయిం చుకు రాగలడు రాముడు. కాని అంకడు అందుకు అంగీకరించలేదు.

'తప్పదనుకుంటేనే కత్తిని ఉపయోగించాలి. అంతేగాని అసలు దాంతోనే ఆరంభించగూడదు' అన్నాడు.

'అయితే మరెలాగ ఆరంభింతాఁవో అరంబించు' అన్నాడు.

అంకడు పోలీస్ కంప్లెయింటు ఇచ్చాడు. ప్రాథమిక హక్కు లకు భంగకరంగా ప్రవర్తిస్తున్న ఊరి మోతుబరులమీద చర్య తీసు కోవాలనీ తను పల్లకీ పెళ్ళి చేసుకోవాటానికి అనువైన వాతావరణం కల్పించాలనీను.

అంకడి అర్జీ వెళ్ళగానే ప్రెసిడెంటుకూ, పెద్దకాపుకూ తాఖీదు లొచ్చాయి. ఊరినిండా పోలీసు బలగంకూడ దిగింది.

పెళ్ళినాటి వుదయం మున్సబు దండోరా వెయ్యించాడు.

'జిల్లా పోలీసు సూపరెన్టెంటువారి తాఖీదు ప్రకారం 144 వ సెక్షను అమల్లో వుందిగనుక ఉత్సవాలుగాని, ఊరేగింపులుగాని జరగటానికి వీల్లేదు. ప్రజలంతా తమ తమ పనులు ప్రశాంతంగా చేసుకోవల్సిందిగా కోరడమైంది.'

★